

ఎఫ్‌ఎల్‌వో చైర్‌పర్సన్ రీతూషాతో ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి

## ఎఫ్‌ఎల్‌వోతో ఏఐజీ హాస్పిటల్స్ జట్టు

### మహిళా ఆరోగ్య సమస్యలపై అవగాహనా కార్యక్రమం

హైదరాబాద్, అక్టోబర్ 20: మహిళలకు సంబంధించిన వివిధ ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్‌వో) కలిసి ఒక సమగ్ర అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఏఐజీ హాస్పిటల్స్ తెలిపింది. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు తొలిదశలోనే స్క్రీనింగ్ ప్రాధాన్యతను మహిళలకు తెలియపరుస్తామని పేర్కొంది. ఈ సందర్భంగా తమ హాస్పిటల్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ నుంచి మహిళా వైద్యులు, ఎఫ్‌ఎల్‌వో లీడర్స్‌తో ఒక చర్చాగోష్ఠి నిర్వహించినట్టు ఏఐజీ వెల్లడించింది. ప్రపంచ ప్రమాణాలతో ఆరోగ్య సంరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, ఫిక్కీ ఎఫ్‌ఎల్‌వోతో భాగస్వామ్యం ద్వారా విస్తృతస్థాయిలో ప్రజలకు చేరువ కావాలన్నది, మహిళల ఆరోగ్య సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నది తమ లక్ష్యమని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి వివరించారు. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వ్యాధుల పట్ల దేశవ్యాప్తంగా మహిళలకు అవగాహన కల్పించడంలో ఏఐజీ హాస్పిటల్స్‌తో కలిసి పనిచేయడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు ఫిక్కీ ఎఫ్‌ఎల్‌వో చైర్‌పర్సన్ రీతు షా తెలిపారు.

# పసిడికి పండుగ కళ

### మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు

### ఒక్కరోజే రూ.770 ఎగిసిన తులం రేటు

### హైదరాబాద్‌లో రూ.61,530కి చేరిక

### వెండి మార్కెట్‌లో స్థిరత్వం

*గోల్డ్ మార్కెట్ పండుగ కళను సంతరించుకున్నది.*

మొన్నటిదాకా పడుతూలేస్తూ సాగిన పసిడి ధరలు.. ఇప్పుడు వేగాన్ని అందుకున్నాయి.

*ఒక్కరోజే దేశీయంగా తులం రూ.700లకుపైగా ఎగిసిన పుత్తడి విలువ.. హైదరాబాద్‌లో రూ.61,500లను దాటేసింది.*



న్యూఢిల్లీ, అక్టోబర్ 20: పండుగల వేళ పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. శుక్రవారం ఒక్కరోజే హైదరాబాద్ మార్కెట్‌లో తులం 24 క్యారెట్ స్వచ్ఛమైన బంగారం ధర రూ.770 పుంజుకున్నది. దీంతో రూ.61,530కి చేరుకున్నది. అంతకుముందు రెండు రోజుల్లోనూ రేట్లు పెరుగగా.. వరుసగా ఈ మూడు రోజుల్లో రూ.1,580 ఎగిసింది. 22 క్యారెట్ ఆభరణాల బంగారం 10 గ్రాములు సైతం రూ.700 ఎగబాకింది. రూ.56,400లుగా ఉన్నది. మూడు రోజుల్లో రూ.1,450 పెరిగింది. ఇక దేశ రాజధాని నగరం ఢిల్లీ మార్కెట్‌లోనూ పుత్తడి ధరలు దూకుడు మీదున్నాయి. 24 క్యారెట్ 10 గ్రాములు రూ.61,650 పలుకుతున్నది. గురువారంతో పోల్చితే మరో రూ.750 అందిపుచ్చుకున్నది.

**పెరిగిన డిమాండ్**

ప్రస్తుత పండుగల సీజన్, రాబోయే పెండ్లిళ్ల సీజన్ రెండూ.. గోల్డ్ మార్కెట్‌కు కొత్త కళను తెచ్చిపెట్టాయి. బంగారం దుకాణాల్లో ఇప్పుడు కొనుగోలుదారుల సందడి కనిపిస్తున్నది. ధరలు క్రమేణా పెరుగుతుండటం కూడా.. కస్టమర్లను మార్కెట్‌కు రప్పిస్తున్నదని పలువురు దుకాణదారులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల దీపావళికి పుత్తడి ధర మరింత పెరుగవచ్చన్న అంచనాలూ వినిపిస్తున్నాయి.

**అంతర్జాతీయ మార్కెట్‌లో..**

మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లోనూ గోల్డ్ రష్ కొనసాగుతున్నది. ఔన్స్ బంగారం 1,980 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్‌లో ట్రెండ్ బలహీనంగా ఉండటంతో మదుపరులు పుత్తడిపై పెట్టుబడులకు ఆసక్తిని కనబరుస్తున్నట్టు ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలకు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం తోడవడంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం వైపునకొస్తున్నారు. ఈ క్రమంలోనే కొమెక్స్ స్పాట్ గోల్డ్ దాదాపు 4 నెలల గరిష్ఠాన్ని తాకింది. ఇదిలావుంటే వెండి ఔన్స్ 23.20 డాలర్లుగా ఉన్నది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.77,500 వద్ద స్థిరంగా కొనసాగుతున్నది. అయితే ఢిల్లీలో రూ.500 పెరిగి రూ.74,700లకు చేరింది.

**గోల్డ్ ఈటీఎఫ్‌లకు తగ్గిన ఆదరణ**

గత నెల గోల్డ్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్లకు ఆదరణ తగ్గింది. సెప్టెంబర్‌లో రూ.175 కోట్లకే పెట్టుబడులు పరిమితమయ్యాయి. అంతకుముందు నెల ఆగస్టులో 17 నెలల గరిష్ఠాన్ని తాకిన విషయం తెలిసిందే. నాడు రూ.1,028 కోట్లుగా ఉన్నాయి. అయితే మదుపరులు లాభాల స్వీకరణకు పెద్దపీట వేయడం వల్లే తాజా గణాంకాలు నిరాశాజనకంగా ఉన్నాయని దేశీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం (యాంఫీ) తెలియజేసింది. కానీ అమెరికాలో పెరుగుతున్న వడ్డీరేట్లు, అంచనాలకు మించి నమోదవుతున్న ద్రవ్యోల్బణం, మందగిస్తున్న వృద్ధిరేటు మధ్య గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఆదరణ ముున్ముందు ఉంటుందనే విశ్వాసాన్నే ఇండస్ట్రీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలావుంటే ఈ జనవరి-మార్చిలో ఏకంగా రూ.1,243 కోట్ల ఉపసంహరణలు జరిగాయి. నిరుడు జూలై-డిసెంబర్ మధ్య కూడా రూ.485 కోట్లు వెనక్కిపోయాయి.

## కేఫిన్ టెక్నాలజీ లాభం 61 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 20: టెక్నాలజీ ఆధారిత ఆర్థిక సేవల సంస్థ కేఫిన్ టెక్నాలజీస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 28 శాతం ఎగబాకి రూ.61.4 కోట్లుగా నమోదైంది. కిందటి ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.47.92 కోట్లు గడించింది. కంపెనీ ఆదాయం 16 శాతం ఎగబాకి రూ.209 కోట్లకు చేరుకున్నది.

## దివాలా ప్రక్రియకు జీవీకే గౌతమీ పవర్

హైదరాబాద్, అక్టోబర్ 20: జీవీకే గౌతమీ పవర్ లిమిటెడ్‌పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ ధర్మాసనం దివాలా ప్రక్రియను శుక్రవారం ప్రారంభించింది. ఈ మేరకు జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకేపీఐఎల్) తెలియజేసింది. జీవీకే గౌతమీ పవర్ లిమిటెడ్‌పై ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్సీ కోడ్ 2016 కింద ఎడిల్‌వీజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఈఏఆర్‌సీ) దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఎన్‌సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్.. పైవిధంగా ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొన్నది.

## అధిక స్థాయిలోనే వడ్డీ రేట్లు

- ఆర్బీఐ గవర్నర్ సంకేతాలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 20: ద్రవ్యోల్బణం పట్ల రిజర్వ్‌బ్యాంక్ 'అత్యంత అప్రమత్తం'గా ఉంటుందని, ఈ రేటు 4 శాతానికి తగ్గేలా చూస్తుందని గవర్నర్ శక్తికాంత్ దాస్ చెప్పారు. తద్వారా అధిక వడ్డీ రేట్లు దీర్ఘకాలం కొనసాగుతాయన్న సంకేతాలిచ్చారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్ నిర్వహించిన సదస్సులో ఆర్బీఐ గవర్నర్ మాట్లాడుతూ ధరల్ని అదుపు చేయడంపైనే ద్రవ్య విధానం దృష్టిపెడుతుందని, ప్రస్తుతం దిగివస్తున్న ద్రవ్యోల్బణం సజావుగా మరింత తగ్గేలా చూస్తుందన్నారు. అక్టోబర్ 6నాటి ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కేంద్ర బ్యాంక్ వరుసగా నాల్గవసారి వడ్డీ రేట్లను యథాతథంగా అట్టిపెట్టిన సంగతి తెలిసిందే. దాస్ తాజా కఠిన వ్యాఖ్యలతో డాలరు మారకంలో రూపాయి విలువ శుక్రవారం బలపడి 83.08 స్థాయికి చేరింది. ఇటీవల రూపాయిపై ఏర్పడిన ఒత్తిడిని ఆర్బీఐ గవర్నర్ ప్రస్తావిస్తూ డాలరు బలపడటమే ఇందుకు కారణమని, అధిక ఒడిదుడుకుల్ని నిరోధించడానికి కేంద్ర బ్యాంక్ తరచూ కరెన్సీ మార్కెట్లో జోక్యం చేసుకుంటున్నదని అన్నారు.

**10 వేల కోట్ల 2,000 నోట్లు రావాలి**

ప్రజల వద్ద ఇంకా రూ. 10,000 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు ఉన్నాయని శక్తికాంత్ దాస్ వెల్లడించారు. ఈ నోట్లు సైతం తమ వద్దకు తిరిగి వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



## లారస్ లాభంలో భారీ క్షీణత

హైదరాబాద్, అక్టోబర్ 20: లారస్ ల్యాబ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 84.1 శాతం తగ్గి రూ.37.12 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికానికిగాను సంస్థ రూ.233.39 కోట్ల లాభాన్ని గడించింది. అటు ఆదాయం కూడా 22.3 శాతం తగ్గి రూ.1,224 కోట్లకు పరిమితమైంది. మరోవైపు, ప్రతిషేరుకు 40 పైసలు మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.


# స్టార్టప్ క్యాపిటల్ హైదరాబాద్

### టీ-హబ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

### వివిధ రంగాల్లో 20కిపైగా ఇంక్యుబేటర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): దేశంలో స్టార్టప్ క్యాపిటల్‌గా హైదరాబాద్ అవతరించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం స్టార్టప్‌లను ప్రోత్సహించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందు కోసం టీ-హబ్‌ను ఏర్పాటు చేసింది. ఇది.. దేశంలోనే అత్యుత్తమ ఆవిష్కరణ వ్యవస్థను తెచ్చింది. ఫలితంగా ఇప్పుడు స్టార్టప్‌లకు స్వర్గధామంగా రాష్ట్రం మారింది. 2016లోనే రాష్ట్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ పాలసీని రూపొందించి అమల్లోకి తీసుకొచ్చింది. కేవలం ఐటీ రంగంలోనే కాకుండా ఔషధ, బయో, మెడికల్, వ్యవసాయ, మహిళ, సామాజిక అంశాల్లో ప్రత్యేకంగా స్టార్టప్‌లను ఏర్పాటు చేసేందుకు వీలుగా వేర్వేరు ప్రాంతాల్లో ఇంక్యుబేటర్‌లను ఏర్పాటు చేయించారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 20కిపైగా ఇంక్యుబేటర్లు పనిచేస్తున్నాయి. తెలంగాణలో శరవేగంగా స్టార్టప్ ఎకోసిస్టం మెరుగుపడటానికి ఇక్కడి నైపుణ్యం కలిగిన మానవ వనరులూ కారణమే. స్టార్టప్‌లకు ఫండింగ్ చేసేందుకు ఎంతోమంది పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతుండటం కూడా కలిసొస్తున్నది. ఐటీ రంగంలో ఎంతో ప్రగతి సాధించినట్టే స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధిలోనూ తెలంగాణ ప్రభుత్వం కృషి చేసింది.

**టీ-హబ్ ప్రగతి ఇలా..**



- 2 వేలకుపైగా స్టార్టప్‌లకు ప్రయోజనం
- ఇక్కడి స్టార్టప్‌లకు సమకూరిన రూ.1,860 కోట్ల నిధులు
- 100కుపైగా ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు
- 75కుపైగా ప్రముఖ కంపెనీల నుంచి స్టార్టప్‌లకు భాగస్వామ్యం
- టీ-హబ్ ఏర్పాటైన దగ్గర్నుంచి ఇప్పటి దాకా 1000కిపైగా ఈవెంట్లు
- 600లకుపైగా కార్పొరేట్ కంపెనీలతో కలిసి స్టార్టప్ ప్రోత్సాహక కార్యక్రమాలు
- 400లదాకా అంతర్జాతీయ భాగస్వామ్య కార్యక్రమాలు
- టీ-హబ్ కేంద్రంగా 200లకుపైగా మెంటార్‌లు
- 42 దేశాలు టీ-హబ్‌ను చూసి కొత్తగా ఆవిష్కరణల కోసం కార్యక్రమాలు
- టీ-హబ్‌ను ఇప్పటిదాకా సందర్శించిన 1.50 లక్షల మంది

